క్లుప్తంగా

కళ్లను కాపాడుకుందాం



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కె.ఎల్.నాయుడు

శ్రీకాకుళం అర్బన్: నేత్రాలు దేవుడిచ్చిన అపురూపమైన నిధి అని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేనని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర అన్నారు. దృష్టి దినోత్సవంలో భాగంగా గురువారం నగరంలోని కె.ఎల్.నాయుడు కంటి వైద్యశాలలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా కంటి వైద్యులు కె.ఎల్.నాయుడు సహకారంతో ఉచితంగా కళ్ల పరీక్షలను నిర్వహించి మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎన్విరాన్మెంట్ చైర్మన్ పాన్నాడ రవికుమార్, మెంటార్ నటుకుల మోహన్, కార్యదర్శి రామ్‌గోపాల్, సభ్యులు రామ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పసిబిడ్డకు అరుదైన శస్త్రచికిత్స



పసిబిడ్డతో డాక్టర్లు, తల్లిదండ్రులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కడుపులో ఉండాల్సిన పేగులు ఛాతిలోకి ఎగబాకి.. ఊపిరితిత్తులు, గుండెను నొక్కి తీవ్రమైన శ్వాస సమస్యతో పుట్టిన బిడ్డకు డాక్టర్ బాదాన రామకోటేశ్వరరావు, గైనకాలజిస్ట్ డా.పద్మావతి బృందం అరుదైన శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. శ్రీకాకుళం నగరంలో శ్రీఆర్‌కే హాస్పిటల్‌లో ఈ శస్త్ర చికిత్స నిర్వహించారు. గర్భధారణ జరిగిన ఐదో నెలలోనే టిఫా స్కాన్‌లో కాజెంటల్ డయాఫ్రమిటిక్ హెర్నియా ఉన్నట్లు గుర్తించామని, అప్పటి నుంచే మంచి వైద్యాన్ని అందించి చివరకు శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడామని డాక్టర్ పద్మావతి తెలిపారు. తమ బిడ్డ ప్రాణాలను రక్షించినందుకు శాస్త్రులుపేటకు చెందిన జాన్సీ, వినోద్ దంపతులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్‌లే కీలకం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీఓ

జి.సిగడాం: పంచాయతీలు అన్ని విధాలా అభివృద్ధి సాధించాలంటే సర్పంచ్‌లే కీలక పాత్ర పోషించాలని ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. పారిశుద్ధ్యం నిర్మూలన, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు వడగా గౌరీశంకరరావు, కోరుకొండ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.


రిజర్వేషన్లు పాటించాలని వినతి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందిస్తున్న దళిత సంఘాల నేతలు

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో సబ్జెక్ట్ కాంట్రాక్టుగా విధులు నిర్వహిస్తున్న వారికి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకాలు చేపట్టేటప్పుడు ఎస్సీ, ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పనిసరిగా పాటించాలని దళిత ప్రజా సంఘాల జేఏసీ కన్వీనర్ డి.గణేష్, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, అంబేడ్కర్ చైర్‌సాధన సమితి జిల్లా కన్వీనర్ టి.రమణ కోరారు. ఈ మేరకు వర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్యకు వినతిపత్రం అందజేశారు. ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులు తక్షణమే నియమించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. అనంతరం రిజిస్ట్రార్ మాట్లాడుతూ వినతిపత్రంలో పేర్కొన్న విషయాలను వైస్ చాన్సలర్ దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు.

నందెన్నకు పుష్పాభిషేకం



పూజలందుకుంటున్న నందెన్న

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉమా జలలేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న నందెన్న ఉత్సవాల సందర్భంగా స్వామివారికి గురువారం పుష్పాభిషేకం నిర్వహించారు. అర్చకులు అశ్వినీకుమార్, మహేష్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.



జాడ- జగన్నాథవలస గ్రామాల మధ్య మలుపు



చంద్రయ్యపేట-దేవరవలస గ్రామాల మధ్య ఇలా..

ఆ మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు!



బాతువ-పున్నాం గ్రామాల మధ్య ప్రమాదకర మలుపు

- ఇరువైపులా పేరుకుపోయిన ముళ్లపొదలు
- వాహనచోదకులకు తప్పని పాట్లు
- పట్టించుకోని అధికారులు



జగన్నాథవలస-నర్సింహంపురం వెళ్లేదారిలో భారీ మలుపు

జి.సిగడాం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మలుపులు ప్రమాదకరంగా మారాయి. వాహనం దగ్గరకు వచ్చేవరకు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టకపోవడంతో రాత్రివేళ వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జి.సిగడాం మండలంలో జాడ- జగన్నాథవలస, చంద్రయ్యపేట- వెలగాడ, ఎస్.పి.ఆర్.పురం- జి.సిగడాం, గెడ్డకంచరాం- బాతువ గ్రామాల మధ్య మలుపులు ప్రమాదకరంగా పరిణమించాయి. ఈ ప్రాంతాల్లో ఇప్పటికే పలు ప్రమాదాలు సంభవించాయి. జి.సిగడాం మండల కేంద్రం నుంచి డి.ఆర్.వలస, పున్నాం నుంచి పొందూరు వరకు భారీ మలుపులు ఉన్నాయి. ఆయా మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు పేరుకుపోయాయి. దీంతో వాహనాలు సమీపంలోకి వచ్చేవరకు కనిపించని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ముళ్లపొదలు తొలగించాలి..



రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు భారీగా పేరుకుపోయాయి. మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రివేళల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– చిక్కాల శ్రీనివాసరావు, జాడ, జి.సిగడాం మండలం

మలుపులతో పెను ప్రమాదాలు



జి.సిగడాం నుంచి వెంకయ్యపేట, జగన్నాథవలస, జాడ మీదుగా ముషినివలస వరకు భారీగా మలుపులతోపాటు రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు పేరుకుపోయాయి. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడంలేదు.

– కొర్రాయి అప్పారావు, జాడ, జి.సిగడాం మండలం

తుప్పలు తొలగించాలి..



రోడ్డుకు ఇరువైపులా భారీగా పొదలు అలుముకోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాహనాలు దగ్గరగా వచ్చే వరకు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి తుప్పలు తొలగించాలి.

– ఇజ్జి కోటి, జాడ, జి.సిగడాం మండలం

వార్డు సచివాలయ సిబ్బందికి శిక్షణ



మాట్లాడుతున్న కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ గవర్నెన్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఆమదాలవలస మున్సిపాలిటీలకు చెందిన వార్డు ఎమినిటీ సెక్రటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పర్యావరణ కార్యదర్శులకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయ కౌన్సిల్ హాల్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిర్మూలన, స్వచ్ఛ సర్వేక్షన్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు లావేరు హైస్కూల్ విద్యార్థులు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రణస్థలం: లావేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ రకాల క్రీడా పోటీలలో నాలుగు విభాగాల నుంచి 13 మంది రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పసుపుల జగన్నాథం గురువారం తెలిపారు. శ్రీకాకుళంలో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో 200 మీటర్ల పరుగులో వై.రఘు, త్రోబాల్‌లో బి.తనూజ, వై.రఘు, వాలీబాల్‌లో వై.మహేష్, బేస్‌బాల్‌లో ఏ.జీవిత, ఎల్.లక్ష్మి ఏ.భానుప్రసాద్, ఎన్.ధనుష్, వై.కృష్ణ, ఎన్.రామకృష్ణ, వై.రఘు, ఎస్.గోవింద, ఎస్.కిషోర్‌లు రాణించారని చెప్పారు. వీరితో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు జర్థాన సుదర్శనంను హెచ్‌ఎం, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ లంకలపల్లి రాంబాబు, మాజీ అగ్రికల్చరల్ మార్కెట్ చైర్మన్ ఇనపకుర్తి తోటయ్య దొర, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ అధ్యక్షుడు పిసిని వసంతరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

పేదింటి యువతికి బంగారు కానుక



ఆభరణాలు అందిస్తున్న సప్తగిరి జ్యూయలర్స్ యజమాని వెంకటరావు

శ్రీకాకుళం రూరల్: గార మండలం అచ్చెన్నపాలెం గ్రామానికి చెందిన సప్తగిరి జ్యూయలర్స్ యజమాని గంగు వెంకటరావు కళ్యాణమస్తు పేరిట అచ్చెన్నపాలెం గ్రామానికి చెందిన శిమ్మ రమణమూర్తి కుటుంబానికి రెండు తులాలు బంగారం తాడు, పావుకేజీ వెండి వస్తువులను గురువారం ఉచితంగా అందజేశారు. గత ఏడాది డిసెంబర్‌లో శ్రీకాకుళం పరిధిలోని సప్తగిరి జ్యూయలర్స్ షాపులో తీసిన లక్కీడ్రాలో అచ్చెన్నపాలెం గ్రామానికి చెందిన శిమ్మ రమణమూర్తి కుమార్తె శిమ్మ శైలజ ప్రథమ బహుమతికి ఎంపికయ్యింది. అప్పట్లో ఆ యువతికి కళ్యాణమస్తు సర్టిఫికెట్ అందజేశారు. లక్కీ డ్రాలో ఎంపికైన ఐదుగురు మహిళల్లో ఇద్దరికి కళ్యాణమస్తు కానుక కింద బంగారు ఆభరణాలు అందించారు. శైలజకు వివాహం నిశ్చయం కావడంతో కుటుబ సభ్యులు, గ్రామపెద్దలు సమక్షంలో ముందుగా ప్రకటించిన విధంగా బంగారం, వెండి ఆభరణాలు అందజేశారు.

'రైతుకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ'

శ్రీకాకుళం పాతబస్టాండ్: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని సేకరణ చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ధాన్యం సేకరణపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరణపై సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ గత సమస్యలు పునరావృతం కారాదన్నారు. సివిల్ సప్లయ్స్ డియం వేణుగోపాల్ మాట్లాడుతూ రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. రైస్ మిల్లు, రైతు సేవా కేంద్రాలు వద్ద ఉన్న తేమ తెలియజేసే మిషన్లు ఒక కంపెనీవి ఉంచాలన్నారు. జీపీఎస్ ఉన్న వాహనాలను మాత్రమే ధాన్యం తరలింపుకు తీసుకుంటామని చెప్పారు.

ఐకమత్యంగా మెలగాలి



ఫెలోషిప్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం కల్చరల్: క్రైస్తవ సోదరులంతా కలసికట్టుగా ఉండాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని గొంటివీధిలో ఎల్‌డబ్ల్యూపీహెచ్ చర్చిలో రెవ.డాక్టర్ జోసెఫ్ డానియల్ అధ్యక్షతన పాస్టర్స్ ఫెలోషిప్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో 80కిపైగా ఉన్న సంఘాలు ఒకేచోటకు చేరడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రైస్తవ సంక్షేమ సంఘం సెక్రటరీ డీఎల్‌బీఎల్ కుమార్, దైవ సేవకులు శామ్యూల్ రాజు, బిషప్‌లు శామ్యూల్ మేజేష్, బర్నబాస్ బింకం, కె.సుజ్ఞానరావు, పాస్టర్లు మండ ఎలిషా, కె.ప్రేమ్‌కుమార్, జోయల్ శామ్యూల్ గోడి సన్నీ, ఎస్.వి.రమణమాదిగ, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం కనుమరుగు



మురపాకలో వృథాగా పడిఉన్న సామూహిక మరుగుదొడ్లు

- వృథాగా సామూహిక మరుగుదొడ్లు
- లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా

ఎచ్చెర్ల: పాలకుల్లో నిర్లక్ష్య వైఖరి, అధికారుల అలసత్వం, ప్రజల్లో అవగాహన లేమి వెరసి పలు కార్యక్రమాల లక్ష్యం నీరు గారుతోంది. లక్షలాది రూపాయలతో గ్రామాల్లో నిర్మించిన కమ్యూనిటీ మరుగుదొడ్లు ప్రజాప్రతినిధులు, అధికారులు అనాలోచిత నిర్ణయాల కారణంగా నిరుపయోగంగా మారాయి. 2014–19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం అవసరం లేని చోట్ల కూడా ప్రజాధనం వృథా చేసి సామూహిక మరుగుదొడ్లు నిర్మించింది. లావేరు మండలంలో మురపాక, లావేరు, కేశవరాయునిపాలేం, పెద్దరావుపల్లి తదితర గ్రామాల్లో నిర్మించిన మరుగుదొడ్లు శతశాతం నిరుపయోగంగా పడి ఉన్నాయి. రన్నింగ్ వాటర్ సదుపాయం లేక స్థానికులు ఉపయోగించకుండా విడిచిపెట్టేశారు. కొన్ని గ్రామాల్లో కమ్యూనిటీ మరుగుదొడ్లు అవసరం లేకపోయినప్పటికీ కేవలం టీడీపీ నాయకులకు కాంట్రాక్ట్ పనులు అప్పగించడం కోసం నిర్మించారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథాగా మారింది. చాలా గ్రామాల్లో ఇంటిముందు ఉన్న మరుగుదొడ్లలో వంట సామగ్రి, వ్యవసాయ పనిముట్లు దాచిపెట్టుకుంటున్నారు.

నిర్వహణ లోపం..

2019 తర్వాత వైఎస్సార్‌సీపీ హయాంలో బహిరంగ మలవిసర్జన చేయడం వల్ల కలిగే అనర్థాలను అధికారులు ప్రజలకు వివరించింది. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించేలా చర్యలు తీసుకున్నారు. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం అమల్లోకి వచ్చినప్పటి నుంచి సామూహిక మరుగుదొడ్ల నిర్వహణ గాలికొదిలేశారు. చాలా చోట్ల తలుపుల్లేవు. మరికొన్ని చోట్ల రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించలేదు. అధికారులు స్పందించి సామూహిక మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రన్నింగ్ వాటర్ లేకే..

గ్రామాల్లో మరుగుదొడ్లు లేక చాలా మంది ఆరుబయటే మలవిసర్జనలు చేస్తున్నారు. కొన్నిచోట్ల మరుగుదొడ్లు నిర్మించి నీటి వసతి కల్పించకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి.

– రెడ్డి గోపాల్, చిన్నయ్యపేట, లావేరు మండలం

బాగు చేయాలి

వృథాగా పడి ఉన్న మరుగుదొడ్లను బాగుచేయాలి. చాలా మందికి సొంత మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సామూహిక మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలి.

– గొర్లె శ్రీరాములునాయుడు, మురపాక, లావేరు మండలం

ప్రజల్లోకి చంద్రబాబు మోసాలు



సమావేశంలో మాట్లాడుతున్న చిత్తిరి మోహన్

జి.సిగడాం: సీఎం చంద్రబాబు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు కలిసికట్టుగా పనిచేయాలని పార్టీ ఎచ్చెర్ల నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు చిత్తిరి మోహన్ అన్నారు.

గురువారం జి.సిగడాంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. కూటమి నాయకులు వేధింపులకు గురిచేస్తే వెంటనే డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు విక్రం కోటిబాబు, గేదెల మల్లిబాబు, పున్నాన అక్కలనాయుడు, భూపతి సురేష్ కుమార్, ధారబోయిన ధర్మారాజ్, మావిడి శ్రీనివాసరావు, బొల్లా జనార్దనరావు పాల్గొన్నారు.

సకాలంలో రెన్యువల్ చేసుకుంటేనే రాయితీ



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణ

జి.సిగడాం : ఖరీఫ్ సీజన్‌లో తీసుకున్న పంట రుణాలను రైతులు సకాలంలో రెన్యువల్ చేసుకుంటేనే వడ్డీ రాయితీ వర్తిస్తుందని డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక సహకార సంఘ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాదిలో తీసుకున్న రుణాలను ఆ తేదీ ముందు మూడు రోజులలోపు రుణాలను రెన్యువల్ చేసుకోవాలన్నారు. సమయం దాటిపోతే వడ్డీ రాయితీ వర్తించదని స్పష్టం చేశారు. ప్రతి రైతుకూ పంటల బీమా పథకం వర్తించేలా చొరవ తీసుకోవాలన్నారు. కాగా, ఇక్కడ సీఈఓగా విధులు నిర్వహిస్తున్న ఆబోతుల పాపినాయుడుకు ఆర్థిక సమస్యలు ఉన్నందున పదవి నుంచి తప్పించాలని సహకార సంఘం చైర్మన్ బెవర జగన్నాథరావుకు సూచించారు. ఆయన ఆదేశాల మేరకు సొసైటీలో విధులు నిర్వహిస్తున్న చిన్నారావుకు బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ పడాల అప్పన్న, సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌టవర్ పనులు నిలిపివేత



పనులు నిలిపివేసిన దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): 'సెల్‌టవర్ మాకొద్దు బాబోయ్' అనే శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. టవర్ నిర్మాణానికి తీసిన గుంతను సచివాలయ ఉద్యోగుల సమక్షంలో జేసీబీ సాయంతో కప్పివేశారు. నిర్మాణ సామగ్రి తక్షణమే ఇక్కడి నుంచి తీసుకెళ్లాలని నోటీసులు జారీచేశారు. పనులు నిలిపివేతపై శాంతినగర్, నెహ్రూనగర్ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

సంక్షిప్తంగా..

నేడు, రేపు సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ ఎగ్జిబిషన్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జీఎస్టీ రేట్ల తగ్గింపు సామాన్యులకు ఊరటనిచ్చిందని సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు కమర్షియల్ టాక్స్ డిప్యూటీ కమిషనర్, నోడల్ అధికారి ఎం.స్వప్నాదేవి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళంలో ఎలక్ట్రానిక్ వస్తువుల గ్రాండ్ ఎగ్జిబిషన్ కమ్ సేల్‌ను ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో 10, 11వ తేదీల్లో రెండురోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు.

ఘనంగా దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో దుర్గామల్లేశ్వరస్వామి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కృష్ణా పార్కు వద్ద తురాయి చెట్టు వీధిలో దుర్గా మల్లేశ్వరస్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పెంట సింహాచల శర్మ ఆధ్వర్యంలో సూర్యనమస్కారాలు, శివ దుర్గలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక లలితాసహస్రనామ పారాయణలు నిర్వహించారు. ఈశ్వర్ ఆర్ట్స్ అండ్ డిజిటల్స్ ఆధ్వర్యంలో భజనలు, అన్నప్రసాద వితరణ జరిగింది.

పంచాయతీలే సంపద సృష్టించుకోవాలి

శ్రీకాకుళం రూరల్: పంచాయతీలే సంపద సృష్టించుకోవాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం పంచాయతీ సిబ్బంది, సర్పంచ్‌లతో శిక్షణ తరగతులు నిర్వహించారు. మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, విద్యుత్ సమస్యలు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించాలని సర్పంచ్‌లు విన్నవించగా.. ప్రతీ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న ఇంటిపన్ను బకాయిలు వసూలు చేసి అభివృద్ధికి నిధులు సమకూర్చుకోవాలని ఎమ్మెల్యే బదులిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రకాశరావు, డిప్యూటీ ఎంపీడీఓ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డీఎస్సీ నియామకాలతో బడులు బలోపేతం



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు

శ్రీకాకుళం: డీఎస్సీ–2025 నియామకాలతో ప్రభుత్వ బడులు బలోపేతం కానున్నాయని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎస్సీ 2025 ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. కొత్తగా డీఎస్సీ ద్వారా విధుల్లో చేరే సమయానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త డీఏని ప్రకటించబోతుందన్నారు. కార్యక్రమంలో ఉపవిద్యాశాఖ అధికారి ఆర్.విజయకుమారి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తంగి మురళీమోహనరావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పప్పల రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దానేటి కేశవరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బత్తుల రవికుమార్, కరణం సీతరాజు, సీనియర్ నాయకులు బైరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్ : జ్వరంతో బాధపడుతున్న ఓ వివాహిత రిమ్స్‌లో చికిత్స పొందుతూ అదృశ్యమైనట్లు రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు గురువారం పేర్కొన్నారు. వాంబేకాలనీలో నివాసముంటున్న మైలపల్లి లక్ష్మి, సూర్యనారాయణ దంపతులు తమ కుమార్తె వరం (30)ను అక్కివరం గ్రామానికి చెందిన కంది అప్పలరాజుతో 2009లో వివాహం చేశారు. వీరికి 14 ఏళ్ల కుమార్తె ఉంది.ఆగస్టు 25న వరం తీవ్ర జరం బారిన పడటంతో రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. మరుసటి రోజు నుంచి ఆమె కనిపించలేదు. అన్నిచోట్లా వెతికినా ఫలితం లేకపోవడంతో వివాహిత తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

జీఎస్టీపై అవగాహన అవసరం



పోస్టర్ ప్రెజెంటేషన్ చేస్తున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్, లెక్చరర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, ప్రజలను చైతన్యవంతుల్ని చేసే బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ(అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు కోరారు. కళాశాలలో 'సూపర్ జీఎస్టి 2.0 సూపర్ సేవింగ్స్ 'అనే అంశంపై గురువారం కామర్స్, ఆర్థికశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కామర్స్ శాఖాధిపతి ఎల్.కృష్ణారావు, ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ కె.ప్రభాకర్, అధ్యాపకులు కె.లలితా బాయి, పి.సంతోషి పట్నాయక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చిన్నారావు, ఐక్యుఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.పద్మావతి, అకడమిక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.మౌనిక తదితరులు